సాక్షి
తిరుపతి

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024

గళం విప్పుతూ..కదం తొక్కుతూ!



ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా నిలిచి అక్రమాలపై ప్రశ్నించే మీడియాపై దాడులు చేయడం సిగ్గుచేటని, దాడికి పాల్పడ్డ అధికారం పార్టీ నేత పార్థసారథి అనుచరులను తక్షణమే అరెస్ట్ చేయాలని పలువురు జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్టుల సంఘాల నేతలు డిమాండ్ చేశారు. పులివెందుల నియోజకవర్గం, వేముల మండలం కేంద్రంలో నీటి సంఘాల ఎన్నికల కవరేజ్‌కు వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామన్ రాము, సాక్షి దినపత్రిక రిపోర్టర్ రాజారెడ్డిపై టీడీపీ నేత పార్థసారథి అనుచరులు చేసిన మూకుమ్మడి దాడిని ఖండించారు. ఈ మేరకు శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి మీడియాపై దాడికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్షుడు ఆర్.మురళీకృష్ణ, కార్యదర్శి బాలచంద్ర, ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.గిరిబాబు, ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో దాడులు మితిమీరాయన్నారు. ఇలాగే దాడులు చేస్తే జర్నలిస్టుల యూనియన్లు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. అనంతరం జాప్ రాష్ట్ర కార్యదర్శి కల్లుపల్లి సురేందర్‌రెడ్డి మాట్లాడారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాక్షి టీవీ, సాక్షి పత్రిక మీడియా ప్రతినిధులు, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. – తిరుపతి కల్చరల్

న్యూస్‌రీల్

బంగారు తిరుచ్చిపై చిద్విలాసం



బంగారు తిరుచ్చిపై దర్శనమిస్తున్న రుక్మిణీసత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణ స్వామివారు, అమ్మవార్లతో కలసి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం శ్రీరుక్మిణిసత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ ముని బాలకుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదారు జలందర్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 9 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 63,722 మంది స్వామివారిని దర్శించుకోగా.. 22,225 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.77 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 9 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా, గూడూరులోని ఎస్పీఎస్ ప్రాథమికోన్నత ఎయిడెడ్ పాఠశాలలో టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కేవీఎన్.కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టు–1, లాంగ్వేజ్ పండిట్ (తెలుగు) పోస్టు–1, లాంగ్వేజ్ పండిట్ (హిందీ) పోస్టు–1, డైరెక్ట్ నియామకం ద్వారా భర్తీ చేసేందుకు ఆ పాఠశాల కరస్పాండెంట్ నోటిఫికేషన్ మంజూరు చేసినట్లు వెల్లడించారు. అర్హత ఉన్న అభ్యర్థులు ×సీఎస్‌ఈ.ఏపీ.జీటీవీ.ఇన్/ఎయిడెడ్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్స్₹ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ, అలాగే పాఠశాల కరస్పాండెంట్‌కు నేరుగాను ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తులను అందజేయాలని ఆయన సూచించారు.

ఘనంగా ఎనర్జీ కన్జర్వేషన్ డే

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఎనర్జీ కన్జరేవేషన్ డేని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ కే.రంగనాథం హాజరై విద్యార్థులకు ఎనర్జీ కన్జర్వేషన్‌పై అవగాహన కల్పించారు. ఎనర్జీ ఎఫిషియన్సీ, ఎనర్జీ కన్సర్వేషన్ మధ్య తేడాను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచ, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ పీ.మల్లికార్జున, ప్రొఫెసర్ వీరారెడ్డి, కో–ఆర్డినేటర్ డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

ఏకపక్షంగా సాగు!

దాదాపు పదేళ్ల తర్వాత జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. రైతుల మాటున అధికార పార్టీ నేతలు చెలరేగిపోయారు. అధికారుల సహకారంతో ప్రత్యర్థులు లేకుండా ఏకగ్రీవానికి ఉసిగొల్పారు. నామినేషన్లు వేయడానికి వచ్చిన రైతులను ఎక్కడికక్కడ అడ్డుకుంటూ భయాందోళనకు గురిచేశారు. పోలీసుల సహకారంతో కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగారు. ఇదిచాలదన్నట్టు టీడీపీ నేతలు కొందరు జట్లుగా విడిపోయి ఘర్షణలకు దిగారు. మొత్తం మీద సాగునీటి సంఘాలన్నింటినీ అధికార పార్టీ నేతలే దక్కించుకున్నారు.

సైదాపురం మండలం, గిద్దలూరు గ్రామంలో కూటమి నేతల వాగ్వాదం



ఆయకట్టు.. కనికట్టు!

- జిల్లాలో 610 సాగునీటి సంఘాలకుగాను 602 చోట్ల ఏకగ్రీవం
- టీడీపీ నేతల విభేదాలతో 8 చోట్ల వాయిదా
- అధికార పార్టీ నేతలకు సాగిలపడిన అధికారులు
- ఏకగ్రీవాల కోసం అడ్డదారులు

తిరుపతి అర్బన్: జిల్లాలో అన్నదాతలకు చెందిన సాగునీటి సంఘాల ఎన్నికలను రాజకీయం చేశారు. కూటమి నేతలకు అధికారులు సైతం సాగిలపడిపోయారు. ప్రతిపక్షం అనేదే లేకుండా ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేశారు. సకాలంలో నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా నాన్చుతూ వచ్చారు. ఒక వేళ ఇచ్చినా స్క్రూట్నీ పేరుతో వారి నామినేషన్లు తిరస్కరించారు. జిల్లాలో మొత్తం 610 సాగునీటి సంఘాలను ఏకగ్రీవం చేయాలని నేతలు విశ్వప్రయత్నాలు చేశారు. టీడీపీ నేతల మధ్య విభేదాల కారణంగా 8 చోట్ల ఫలితాలు వాయిదా వేశారు. మిగిలిన 602 చోట్ల వారు అనుకున్న వారికే ఆయకట్టు చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ఏకపక్షంగా కట్టబెట్టేశారు.

అల్లంపాడులో ఏకగ్రీవం

కోట : సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీ నాయకులు కుయుక్తులు చేసినా కోట మండలంలోని అల్లంపాడులో పోచారెడ్డి రాజారాంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అల్లంపాడు చెరువు ఆయకట్టు రైతులు పెద్ద సంఖ్యలో పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, మాజీ సర్పంచ్ పోచారెడ్డి రాజారాంరెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. అయితే అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలమైన వారిని అధ్యక్షుడిగా ఎన్నుకునేందుకు పలు కుట్రలు చేశారు. అయితే రైతులందరూ పోచారెడ్డి రాజారాంరెడ్డికి మద్దతుగా నిలిచారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. రాజారాంరెడ్డిని పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి అభినందించారు.



పోచారెడ్డి రాజారాంరెడ్డి

నామినేషన్ పత్రాల చించివేత

సత్యవేడు నియోజకవర్గం, బుచ్చినాయుడుకండ్రిగ మండలం పరిధిలో కాళంగి నది కుడి కాలువకు చెందిన నీర్పాకోట, గాజులపెళ్లూరు, కాంపాళెం గ్రామాల ఆయకట్టు కమిటీకి సంబంధించి టీడీపీ నేత సత్యనారాయణ నామినేషన్ వేయడానికి వచ్చారు. అయితే అదే పార్టీకి చెందిన దిలీప్ వాటిని చించివేశారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ ఏఈ అబ్దుల్‌కలాం బాషా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు దిలీప్‌తోపాటు ఆయన అనుచరులు మునిసుబ్బయ్య, బాబును ఆదుపులోకి తీసుకున్నారు.

మితిమీరిన అధికారుల జోక్యం

సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికారుల జోక్యం మితిమీరింది. చంద్రగిరి నియోజకవర్గం, కుంట్రపాకం చెరువు కమిటీకి ఓ రైతు పోటీ చేయడానికి వెళితే రెవెన్యూ వారు ఇచ్చిన నో డ్యూస్ సర్టిఫికెట్ సక్రమంగా లేదంటూ అతన్ని అనర్హుడుగా ప్రకటించారు. గూడూరు నియోజకవర్గంలో 105 ఏకగ్రీవం చేశారు. చిల్లకూరు మండలం, తొనుకుమాల రెండు చెరువులకు రైతు చక్రపాణిరెడ్డి పోటీ చేయాలని భావించినప్పటికీ ఆయనకు అవకాశం ఇవ్వలేదు. ఓడూరు చెరువుకు ఓ రైతు పోటీ చేయాలని ప్రయత్నం చేసి విఫలమయ్యారు.

భగ్గుమన్న విభేదాలు

టీడీపీ నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. జిల్లాలోని వెంకటగిరి నియోజకవర్గం, సైదాపురం మండలం, గిద్దలూరుకు చెందిన రెండు చోట్ల ఫలితాలను ప్రకటించకుండా వాయిదా వేశారు. అలాగే కోట మండలంలోని ఉత్తమ నెల్లూరుకు చెందిన చెరువు కమిటీకి అబ్బాయి, బాబాయి పోటీ చేయడం.. వారి మధ్య విభేదాలు తలెత్తడంతో ఫలితాలను వాయిదా వేశారు. దొరవారిసత్రం మండలం, కల్లూరు పరిధిలోని ఓ చెరువు కమిటీకి, మేలుపాక, ఉచ్చూరు ఆయకట్టు సంఘాల ఫలితాలు కూడా వాయిదా పడ్డాయి. అలాగే బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కాళంగి నది కుడి కాలువ పరిధిలోని ఎన్నికలను వాయిదా వేశారు. అదే మండలంలో కరకంబట్టు చెరువు కమిటీని కూడా వాయిదా వేశారు.

జిల్లా సమాచారం

నియోజకవర్గం	కమిటీలు	ఏకగ్రీవం	వాయిదా పడ్డవి
గూడూరు	105	103	01
సూళ్లూరుపేట	141	139	02
వెంకటగిరి	109	107	03
సత్యవేడు	107	105	02
చంద్రగిరి	39	39	0
శ్రీకాళహస్తి	109	109	0
మొత్తం	610	603	08

తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో తెలుగు తమ్ముళ్లు తన్నుకున్నారు. మండలంలోని 13 చెరువులు, కాళంగి ప్రాజెక్టు కాలువ కిందనున్న 9 చెరువుల సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాళంగి ప్రాజెక్టు కుడి కాలువకు చెందిన నీర్పాకోట, కాంపాళెం, గాజులపెళ్లూరు చెరువుల టీసీలకు టీడీపీకి చెందిన సత్యనారాయణ, దిలీప్ నామినేషన్ వేశారు. ఇరువురికి చెందిన టీడీపీ శ్రేణులు గొడవపడి బాహాబాహీకి దిగారు. గొడవను పోలీసులు అదుపు చేయలేక ఇబ్బంది పడ్డారు. సత్యనారాయణ నామినేషన్‌ను దిలీప్, ఆయన అనుచరులు బాబు, మునిసుబ్బయ్య చించివేశారు. ఎస్‌ఐ విశ్వనాథనాయుడు రంగప్రవేశం చేసి ముగ్గుర్నీ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కరకంబట్టు చెరువుకు టీడీపీ చెందిన మునెయ్య, శేఖర్ నామినేషన్ వేశారు. గొడవ జరగడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్టు ఎన్నికల అధికారి త్రివిక్రమ్‌రావు తెలిపారు.



గొడవపడుతున్న టీడీపీ నేతలు

పునాది గట్టిగా ఉంటేనే అద్భుత ఫలితాలు



మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ అపర్ణ

రామచంద్రాపురం: ప్రాథమిక తరగతుల్లో భాష, గణితం పరంగా పునాది బలంగా ఉంటే పిల్లలు అద్భుత ఫలితాలు సాధిస్తారని స్టేట్ అబ్జర్వర్ అపర్ణ తెలిపారు. మండలంలోని మెడ్‌జీ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఆరు రోజులుగా ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం అసిస్టెంట్ ఏఎంఓ మధు మాట్లాడారు.

లోక్ అదాలత్‌లో 1,933 కేసుల పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న తిరుపతి మూడవ అదనపు జడ్జి

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,933 కేసులు పరిష్కారమైనట్టు తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఎం.గురునాథ్ తెలిపారు. పరిష్కారమైన కేసులు 450 వరకు ఉన్నాయన్నారు. అలాగే తిరుపతి అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన జరిమానా చెల్లించే కేసులు 1,579 ఉన్నాయన్నారు. కేసుల పరిష్కారం కోసం తొమ్మిది బెంచ్‌లను ఏర్పాటు చేయగా.. వాటికి అధ్యక్షులుగా తనతోపాటు తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి విజయసారథి రాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ, జూనియర్ సివిల్ జడ్జీలు సత్యకాంత్ కుమార్, కోటేశ్వరరావు, సంధ్యారాణి, గ్రంధి శ్రీనివాస్, వైసరితాలు వ్యవహరించారు.

పాఠం పట్టాలెక్కేదెట్టా?

నిరుపేద గిరిపుత్రులు.. వీరి విద్యాభివృద్ధే లక్ష్యంగా గురుకులాల ఏర్పాటు.. వీటిలో రెగ్యులర్ టీచర్ల నియామకం లేమి.. అవుట్ సోర్సింగ్ సిబ్బందితో బోధన.. వారికీ చాలీచాలని వేతనం.. ఆకలి కేకలు పెట్టలేక ఆ సిబ్బంది సమ్మె.. వెరిసి..గిరిపుత్రులకు పాఠం కరువు.. సమీపిస్తున్న పరీక్షలు.. చదువులెట్టా సాగాలో తెలియక దిక్కుతోచని స్థితిలో గిరిజన బిడ్డలు.. పాఠం పట్టాలెట్ట ఎక్కాలి దేవుడా అని వారు ఆవేదన. ఇదీ గిరిజన గురుకులాల్లో దుస్థితి.

రేణిగుంట గిరిజన గురుకుల బాలుర పాఠశాల



- సమ్మెలో అవుట్ సోర్సింగ్ బోధనా సిబ్బంది
- గతనెల 16 నుంచి సమ్మెబాట
- వేతనాలను పెంచాలని డిమాండ్
- గిరిజన గురుకులాల్లో పూర్తి కాని సిలబస్
- పదో తరగతి విద్యార్థుల ఆందోళన
- పట్టని ప్రభుత్వం

రేణిగుంట: రేణిగుంటలో గిరిజన గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ఉంది. ఇందులో ఐదు నుంచి పదో తరగతి వరకు 400 మందికి పైగా పిల్లలు చదువుతున్నారు. ఒక ఇన్‌చార్జి ప్రిన్సిపల్, ఇద్దరు రెగులర్ టీచర్లు, 16 మంది అవుట్‌సోర్సింగ్ బోధనా సిబ్బంది పని చేస్తున్నారు. గత నెల 16వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మెలో ఉన్నారు. దీంతో 400 మంది విద్యార్థులు, ఆరు క్లాసులు, 12 సెక్షన్లకు ముగ్గురు ఉపాధ్యాయులే బోధించాల్సి వస్తోంది. ఇటీవల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెలవు పెట్టడంతో ఇద్దరే దిక్కయ్యారు. దీంతో తరగతి గదుల్లో విద్యార్థులకు నాలుగు గోడలే గురువైన దుస్థితి నెలకొంది. ఈ సమస్య ఒక్క రేణిగుంటకే పరిమితం కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 199 గిరిజన గురుకుల విద్యాలయాల్లోనూ ఇవే అవస్థలు విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. పట్టించుకోవాల్సిన ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తుండడంతో పేద విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు సిలబస్ పూర్తి కాకపోవటం, పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండడంతో కలత చెందుతున్నారు.'

సమ్మెబాట

రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకుల విద్యాలయాల్లో 1,650 మంది అవుట్‌సోర్సింగ్ బోధనా సిబ్బంది పని చేస్తున్నారు. వారిలో టీజీటీ(ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్)కు నెలకు రూ.14,800 వేతనం ఇస్తున్నారు. కటింగ్‌లు పోను రూ.12 వేల వరకు వేతనమందుతోంది. ఇక పీజీటీ(పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్)లకు నెలకు రూ.16,100 వేతనం ఇస్తుండగా,కటింగ్స్‌పోను రూ.14 వేలు చేతికొస్తుంది. ఒక్కొక్క సారి రెండు, మూడు నెలలకు వేతనాలు వచ్చే దుస్థితి. ఐదో తరగతి అటెండర్ బేసిక్ వేతనం కంటే పీజీలు, డిగ్రీలు చేసిన వీరి వేతనాలు తక్కువగా ఉండడంతో మనుగడ కష్టసాధ్యమని అవుట్‌సోర్సింగ్ సిబ్బంది మదనపడుతున్నారు.

సమ్మెబాటలో బోధన సిబ్బంది

గిరిజన గురుకులాల్లో గత నెల 16వ తేదీ నుంచి అవుట్ సోర్సింగ్ బోధనా సిబ్బంది సమ్మెలో ఉండడంతో విద్యార్థుల చదువులు అటకెక్కాయి. పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి కాలేదు. పరీక్షలెట్టా రాయాలంటూ కలత చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వపెద్దలు ప్రేక్షకపాత్ర వహిస్తోండడం గమనార్హం.

అంపశయ్యపై చదువులు

గత ప్రభుత్వంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చి, ప్రపంచంతో పోటీపడే అధునాతన కరికులం తీసుకొచ్చి పిల్లల చదువులు గొప్పగా సాగేందుకు గట్టి పునాది వేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విద్యావ్యవస్థ పతనావస్థ దిశగా పయనిస్తోంది. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ ఛాత్రోపాధ్యాయులకు ఆశ చూపి కుంటిసాకులు చెప్పి వాయిదా వేసుకుంటూ ముందుకు సాగుతుండడంతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి.



టీచర్లు లేకుండా ఉన్న 10వ తరగతి గది

ప్రధాన డిమాండ్లు ఇవే..

- వేతనాలు పెంచాలి
- కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ టీచర్లుగా గుర్తించాలి
- ఉద్యోగ భద్రత కల్పించి, ఆ పోస్టులకు డీఎస్సీలో మినహాయింపు ఇవ్వాలి

మా డిమాండ్లను పరిష్కరించండి



నేను పుత్తూరు గిరిజన గురుకుల పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిన టీజీటీగా గణిత సబ్జెక్ట్‌ను బోధిస్తున్నాను. చాలీ, చాలని వేతనాలతో చాలా ఇబ్బందిపడుతున్నాం. జీతాలు పెంచాలని ఆనేకసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. మేము గత్యంతరం లేక సమ్మెబాట పట్టాము. దీంతో పిల్లల చదువులు కుంటుపడుతున్నాయి. ప్రభుత్వం మా న్యాయమైన డిమాండ్లను పెద్ద మనసుతో పరిష్కరించాలి.

– కె.రాధ, గిరిజన గురుకుల రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, పుత్తూరు

చాలా భయమేస్తోంది



నేను పదో తరగతి చదువుతున్నాను. 25 రోజులుగా మాకు క్లాసులు సరిగా జరగడం లేదు. కేవలం సైన్స్, గణితం సబ్జెక్టులు మాత్రమే బోధిస్తున్నారు. అవుట్ సోర్సింగ్ టీచర్లు సమ్మెలో ఉండడంతో మాకు క్లాసులు జరగడం లేదు. సిలబస్ పూర్తి కాలేదు. తెలుగు మొదట్లో సీబీఎస్సీ సిలబస్ అన్నారు. మళ్లీ ఎస్సీఈఆర్‌టీ సిలబస్ అని చెప్పి చాప్టర్లు సగం కూడా పూర్తి కాలేదు. సోషియల్, ఆంగ్లం, హిందీ కూడా అదే పరిస్థితి. పబ్లిక్ రాయనున్న మాకు ఈ పరిస్థితి ఏమిటి, తలచుకుంటుంటే చాలా భయంగా ఉంది. ప్రభుత్వం పట్టించుకుని మాకు టీచర్లను ఏర్పాటు చేసి సిలబస్ పూర్తి చేయించాలి.

– బి.రుషికేశ్ నాయక్, పదో తరగతి, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, రేణిగుంట

చాలీ, చాలని జీతాలతో వెట్టి చాకిరీ



నేను రేణిగుంట గిరిజన సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో తెలుగు టీజీటీగా అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నాను. నాకు నెలకు రూ.14,800 వేతనం. అందులో చేతికొచ్చేది రూ.12 వేలే. ఐదో తరగతి చదివిన అటెండర్‌కు ఇచ్చే కనీస వేతనం కన్నా మా జీతం చాలా తక్కువ. దీంతో జీవనం చాలా దుర్భరంగా ఉంది. ప్రభుత్వ పెద్దలు మా మొర ఆలకించి మా డిమాండ్లను నెరవేర్చి తిరిగి విధుల్లోకి తీసుకోవాలి.

– ఎం.చంద్రశేఖర్, రేణిగుంట గిరిజన గురుకుల పాఠశాల

విద్యుత్ సేవల్లో జాప్యం వద్దు

తిరుపతి రూరల్: వినియోగదారులకు సకాలంలో విద్యుత్ సేవలందించాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్సీ) చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ సిబ్బందికి పిలుపునిచ్చారు. స్థానిక తిరుపతి సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం తిరుపతి, చిత్తూరు జిల్లాల విద్యుత్ శాఖాధికారులతో ఏపీఈఆర్సీ చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ వారి మన్ననలను పొందాలని సూచించారు. అదేవిధంగా అంతరాయాలు లేని విద్యుత్ సరఫరానే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. సంస్థ పరిధిలో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణను సకాలంలో పూర్తి చేసి, కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని చెప్పారు. అంతకుముందు ఆయన పచ్చికాపల్లం సమీపంలోని ఏపీ ట్రాన్స్‌కో ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. సమావేశంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు వరకుమార్, పీహెచ్ జానకిరామ్, ఏపీఈఆర్సీ ఓఎస్డీ మునిశంకరయ్య, సూపరింటెండింగ్ ఇంజినీర్లు సురేంద్ర నాయుడు (తిరుపతి), ఇస్మాయిల్ (చిత్తూరు), సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఈఆర్సీ చైర్మన్

ఇస్రో శాస్త్రవేత్తలకు బెంగళూరులో వర్క్‌షాపు



వర్క్‌షాపు అనంతరం ఇస్రో శాస్త్రవేత్తలు, ప్రయివేట్ పార్టనర్స్

సూళ్లూరుపేట: అంతరిక్ష ప్రధానకేంద్రమైన బెంగళూరులో ఈనెల 11న భారత ఆటోమోటివ్ పరిశ్రమలో ఎలా వినియోగించుకోవచ్చు అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించినట్టు శనివారం ఇస్రో తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్, ఇన్‌స్పేస్ చైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించుకునే ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఇస్రో, ఇన్‌స్పేస్ సంస్థలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వెల్లడించారు. అలాగే రాకెట్ పరికరాలు, ఉపగ్రహాలకు చెందిన పరికరాలను అందించే ప్రయివేట్ పార్టనర్స్ కూడా ఈ సెమినార్‌లో పాల్గొన్నట్టు తెలిపారు. కెమెరా ఇమేజింగ్ సెన్సార్లు, ఉష్ణోగ్రత, పీడన సెన్సార్లు, అకౌస్టిక్, వైబ్రేషన్ సెన్సార్లు, గైరోస్కోప్‌లు, యాక్సిలరోమీటర్లు, ప్రత్యేకమైన పూతలు, అడ్హెసివ్‌లు, యాంటీ వైబ్రేషన్, నాయిస్ సప్రెషన్ టెక్నాలజీలు, ఇన్సులేషన్ టెక్నాలజీలు, భద్రతా వ్యవస్థలపై కూలకషంగా సెమినార్‌లో చర్చించారు. ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ మాట్లాడుతూ 'భారత అంతరిక్ష కార్యక్రమం నుంచి జ్ఞానాన్ని బదిలీ చేయడం' ప్రాముఖ్యత గురించి వివరించారు. ఇన్‌స్పేస్ చైర్మన్ పవన్ గోయెంకా ఇస్రో శాస్త్రవేత్తల కృషిని ప్రశంసించారు. ఇస్రో శాస్త్రవేత్తలు, ప్రయివేట్ పార్టనర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కదులుతున్న రైలు ఎక్కుతూ..

– గుర్తుతెలియని మహిళ మృతి



చిల్లకూరు: కదలుతున్న రైలు ఎక్కే క్రమంలో గుర్తు తెలియని మహిళ మృతిచెందిన ఘటన గూడూరు రైల్వే స్టేషన్‌లో శనివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. హౌరా నుంచి బెంగళూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు గూడూరులో నిలిచింది. రైలులో నుంచి మంచి నీటి కోసం ప్లాట్‌ఫామ్ మీదకు దిగిన సుమారు 50 ఏళ్ల గుర్తుతెలియని మహిళ రైలు కదులుతుండడంతో వడివడిగా రైలు ఎక్కే ప్రయత్నం చేసింది. దీంతో ఆమె పట్టుతప్పి పడిపోయి తీవ్రంగా గాయపడి మృతిచెందింది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్



కుప్పంబాదూరు 33/11కెవీ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఏపీఈఆర్సీ చైర్మన్

రామచంద్రాపురం: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఏపీఈఆర్సీ చైర్మన్ థాకూర్ రమాసింగ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని కుప్పంబాదూరు 33/11కెవీ సబ్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. సమీప సబ్‌స్టేషన్లలో ఏదైనా సమస్య తలెత్తినా విద్యుత్ అందించే విధంగా యంత్రాలను ఆధునీకరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ సురేంద్రనాయుడు, డీఈ దేవఆశీర్వాదం, ఏఈ గిరి, ఏడీఈ శంకరయ్య, సబ్ ఇంజినీర్ దినేష్ చంద్రారెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



శశిభూషణ్‌రావు

తిరుపతి తుడా: ఢిల్లీ వేదికగా జనవరి 3వ తేదీ నుంచి జరగనున్న జాతీయ స్థాయి ఉద్యోగుల క్రీడాపోటీలకు తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కే.శశిభూషణ్‌రావు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం ఢిల్లీ జాతీయ సివిల్ సర్వీస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డు అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ స్థాయిలో జరిగే బ్యాడ్మింటన్ సింగిల్ విభాగంలో ఆయన తలపడనున్నారు. ఉద్యోగులు ఆయనను అభినందించారు.

శ్రీకాళహస్తిలో హైటెన్షన్

- రివర్ వ్యూ రిసార్ట్ ప్రహరీ, ప్రవేశద్వార ఆర్చి కూల్చివేత
- నిబంధనలకు తూట్లు పొడిచిన మున్సిపల్, పోలీసు అధికారులు
- అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



శ్రీకాళహస్తిలోని రివర్ వ్యూ రిసార్ట్ ప్రవేశ ద్వారాన్ని కూలగొట్టిన అధికారులు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు



రిసార్ట్ కూలనీయకుండా జేసీబీపైకి ఎక్కిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో హైటెన్షన్ నెలకొంది. బఫర్ జోన్ పేరుతో మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఓ రిసార్ట్ ప్రహరీ గోడ, ముందుభాగాన్ని కూల్చివేశారు. శనివారం తెల్లవారుజామున పోలీసు బలగాల సాయంతో మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి శారద తమ సిబ్బందితో కలసి జేసీబీని తీసుకొచ్చి స్వర్ణముఖి కరకట్ట సమీపంలో ఉన్న రివర్ వ్యూ రిసార్ట్ హోటల్ ప్రహరీగోడను కూల్చివేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అక్కడకు చేరుకుని మున్సిపల్ అధికారుల దౌర్జన్యాన్ని ప్రశ్నించారు.

కక్షగట్టి..కూలగొట్టి

శ్రీకాళహస్తి పొన్నాలమ్మ ఆలయం నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయానికి వెళ్లే మార్గంలో స్వర్ణముఖి నది కరకట్ట సమీపంలో మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి కుమార్తెకు చెందిన రిసార్ట్ ఉంది. ఇది సర్వే నం.218–8లో ఒక ఎకరా స్థలంలో 2007లో రిసార్ట్ నిర్మించారు. గత ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పనిచేశారన్న అక్కసుతో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వారిపై కక్షగట్టారు. ఏదో ఒక సాకు చూపి రిసార్ట్‌ను కూల్చేయాలని మున్సిపల్ అధికారులకు హుకుం జారీ చేశారు. దీంతో శనివారం తెల్లవారుజామున ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు జేసీబీతో రిసార్ట్ ప్రహరీగోడను కూల్చివేశారు. సాయంత్రం మళ్లీ వచ్చి ప్రవేశ ఆర్చిని నేలమట్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి మాట్లాడుతూ 17 సంవత్సరాల ముందు నిర్మించిన ఈ రిసార్ట్‌ను ఇప్పుడు బఫర్ జోన్‌లో ఉందని కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు.

దౌర్జన్యాలు మితిమీరాయి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను టార్కెట్‌గా చేసుకుని విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. భౌతిక దాడులతోపాటు వ్యక్తిగత ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. శ్రీకాళహస్తిలో ప్రైవేటు రిసార్ట్ ప్రహరీగోడ, ప్రవేశ ద్వారాన్ని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా.

– భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు

నోటీసైనా ఇవ్వాలి కదా?

శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్ రెడ్డి గెలుపొందిన రోజు నుంచి జేసీబీకి తన వేళ్లను బిగించుకుని వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లను కూలదోయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రయివేట్ పట్టా ల్యాండ్‌లో నిర్మించిన రిసార్ట్‌ను కూడా కూల్చేందుకు పూనుకున్నారు. పొరపాటు ఉంటే కనీసం నోటీసైనా ఇవ్వాలి కదా?. రాజకీయ కక్షలతో నచ్చని వారి ఇళ్లన్నీ కూల్చుకుంటూ పోతే పట్టణంలో ఇకపై ఒక్క ఇల్లు కూడా మిగలదు.

– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే

22న విశ్వంలో గణిత ప్రతిభా పరీక్ష



గణిత ప్రతిభా పరీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విశ్వనాథరెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 22న గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ విద్యా సంస్థ అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రతిభా పరీక్షకు సంబంధించిన సమాచార పత్రికను శనివారం అపుస్మా నాయకులు వెంకటేశ్వర్లు, రవీంద్రారెడ్డి, సంగరాజు భాస్కర్‌రాజు, ఎస్‌ఎం.బాషా, విశ్వం విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణిత ప్రతిభా పరీక్షను వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్, న్యూ బాలాజీ కాలనీలోని ఎంఎంబీజీ స్కూల్లో 5 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తరగతి వారీగా ప్రథమ బహుమతి కింద రూ.20 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.10 వేలు, తృతీయ బహుమతి కింద రూ.5 వేలుతో పాటు ప్రశంసా ప్రతాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 86888 88802 నంబరు ద్వారా వాట్సాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఎస్వీ జూపార్క్ ఫీల్డ్ ఇంజినీర్‌పై చీటింగ్ కేసు

తిరుపతి రూరల్: ఫోర్జరీ సంతకాలతో బిల్లులను దొడ్డిదారిలో డ్రా చేసిన ఎస్వీ జూ పార్క్ ఫీల్డ్ ఇంజినీర్ రవితేజపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు తెలిపారు. ఫారెస్ట్ అసిస్టెంట్ కన్జర్వేటర్ నాగభూషణం ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా.. 2024 ఏప్రిల్, మేలో జూ ఇన్ క్యాంటీన్లో ఎలక్ట్రికల్ పనులు కాంట్రాక్టర్ హరినాథ్ పూర్తి చేసినట్లు తెలిపారు. అప్పట్లో జూ అసిస్టెంట్ క్యూరేటరుగా ఉన్న మాధవి ఆ పనులను ఆదేశించినప్పటికీ, ఆమె బదిలీ పై వెళ్లిన తర్వాత ఆమె పేరు మీద ఫోర్జరీ సంతకం చేసి బిల్లు క్యూరేటర్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. ఫోర్జరీ సంతకం ద్వారా రూ.88,317ను కాంట్రాక్టర్ హరినాథ్‌కు ఫీల్డ్ ఇంజినీర్ రవితేజ మంజూరు చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బిల్లులను పరిశీలించిన ప్రస్తుత అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్ర ప్రసాద్ గతంలో ఉన్న అధికారి మాధవి సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. విచారణ లో నిర్ధారణ కావడంతో రవితేజను విధుల నుంచి తొలగించారు. ఫారెస్ట్ అసిస్టెంట్ కన్సర్వేటర్ నాగభూషణం ఫిర్యాదు మేరకు రవితేజ పై ఫోర్జరీ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు

క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పెనుమడు ప్రశాంత్

తిరుపతి కల్చరల్ : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని, మరింత అప్రమత్తంగా ఉంటూ మహమ్మారి బారిన పడకుండా జాగ్రత్తతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని టాటా క్యాన్సర్ హాస్పిటల్ ఎండీ, నిపుణుడు డాక్టర్ పెనుమడు ప్రశాంత్ తెలిపారు. కరకంబాడి రోడ్డులోని వినాయక సాగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీనివాస, వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వాకర్స్‌కు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెనుమడు ప్రశాంత్ మాట్లాడుతూ.. ధూమపానం, ఊబకాయం ఉన్న వారికి ఎక్కువగా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా స్త్రీలలో బ్రెస్ట్ క్యాన్సర్ అధికంగా ఉందని, వ్యాధి ముదరక ముందే నిర్లక్ష్యం చేయకుండా వైద్య నిపుణులను సంప్రదించి చికిత్సతో నివారించవచ్చని తెలిపారు. అనంతరం పేదలు, వాకర్స్‌కు ఉచితంగా స్క్రీన్ టెస్టులు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ ఆఫ్ తిరుపతి శ్రీనివాస అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, కార్యదర్శి జగన్నాథం, ఆకుల వెంకట రమణమూర్తి, వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలాజీ నాయుడు, కార్యదర్శి శివారెడ్డి, సాయి కృష్ణంరాజు, రామస్వామి పాల్గొన్నారు.

డాక్టర్ అభిజిత్ జైన్‌కు అవార్డు



అభిజిత్‌ను అభినందిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: తిరుపతి స్విమ్స్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యుడు అభిజిత్ జైన్‌కు బెస్ట్ వీడియో ఈ–పోస్టర్ ప్రజెంటేషన్ అవార్డు దక్కింది. పాట్నా వేదికగా రెండు రోజుల క్రితం జరిగిన 34వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని ఉత్తమ ప్రజెంటేషన్ అందించారు. దీంతో ఆయనకు ఈ అవార్డు లభించింది. స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్, విభాగాధిపతి డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ వెంకటరామిరెడ్డి, ప్రొఫెసర్ చంద్రమౌళీశ్వరన్, అధ్యాపకులు ఆయనను అభినందించారు.

పంటలపై ఏనుగుల బీభత్సం

– భయాందోళనలో అన్నదాతలు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడి మొక్కలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలోని పంట పొలాలపై గజరాజుల దాడులతో భారీగా పంట ధ్వంసం అయింది. శనివారం తెల్లవారు జామున ఏవూరు, భాకరాపేట పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దుల్లో ఉన్న పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడులు చేసి టమాట, వరి, చెరకు, అరటి, మామిడి తోటలు ధ్వంసం చేశాయి. అలాగే పొలాలకు వేసిన ముళ్ల కంచె కూసాలను విరిచేశాయి. మూడు వారాల కిందట ఏనుగు మృతి చెందినప్పటి నుంచి గజరాజల గుంపు ఈ ప్రాంతం వదలి వెళ్లడం లేదు. దీంతో ఆ ప్రాంత రైతులు ఏనుగులతో వణికిపోతున్నారు. ఏనుగులు గుంపును అటవీ ప్రాంతం వైపు మళ్లించే చర్యలను తీసుకోవడంలో అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి



ప్రమాదానికి కారణమైన లారీ

శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి పట్టణం, వీఎంపల్లి వద్ద శనివారం చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసుల కథనం.. నెల్లూరుకు చెందిన వినయ్(23), హేమలత(23) ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. తిరుమల దర్శనార్థం శుక్రవారం బయలుదేరారు. శనివారం తిరిగి నెల్లూరుకు బైక్‌పై వెళుతుండగా శ్రీకాళహస్తి పట్టణం, వీఎంపల్లి వద్ద హేమలత బ్యాగు లారీకి చిక్కుకోవడంతో ఆమె లారీ కింద పడిపోయి, అక్కడికక్కడే మృతి చెందింది. వినయ్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఎడ్యుకేషన్ ఫెయిర్



ఎడ్యుకేషన్ ఫెయిర్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : ఫౌండేషన్ ఫర్ యూత్ అడ్వాన్స్‌మెంట్ వారి ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు కపిలతీర్థం సమీపంలోని హోటల్ రాజ్ పార్క్‌లో ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఉపాధ్యక్షుడు టి.నందకిషోర్ తెలిపారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎడ్యుకేషన్ ఫెయిర్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా నున్న ప్రముఖ యూనివర్సిటీలు, అంతర్జాతీయ మెడికల్ కోర్సులు అందించే కళాశాలను ఎడ్యుకేషన్ ఫెయిర్‌తో ఒక వేదికపైకి తీసుకొచ్చి తద్వారా విద్యార్థులకు యూనివర్సిటీలు, కళాశాల కోర్సుల వివరాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, యూజీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో నిర్వాహక సంస్థ ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లు వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

భారతీయతకు పట్టం కట్టాలి



కంచి మఠంలో భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణ చేస్తున్న మంత్రాలయ పీఠాధిపతి

తిరుపతి కల్చరల్: వేద పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి భారతీయతకు పట్టం కట్టాలని మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదుల వారు ఉద్బోధించారు. తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో కంచి మఠంలో చేపడుతున్న స్మార్త శ్రౌత వేద విద్వాన్ మహాసభలు శనివారం రెండో రోజుకు చేరాయి. కార్యక్రమానికి సుబుదేంద్ర తీర్థ ప్రాదుల వారు విచ్చేసి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. 200 మంది వేద విద్యార్థులకు విభుదేంద్ర తీర్థ స్వామి వేద సంభావనలు అందించి సత్కరించారు.

వేడుకగా హోమాలు

దీనికి ముందు కంచి మఠంలో స్మార్త శ్రౌత వేద విద్వన్ మహాసభల్లో భాగంగా సంతాన వేణుగోపాల, సుదర్శన హోమాలు వేడుకగా చేపట్టారు. కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి పర్యవేక్షణలో వేద పండితులు శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. అనంతరం వివిధ వేద పాఠశాలల్లో వేద విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు స్మార్త ఆగమ, అర్చక పరీక్షలు నిర్వహించారు. తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు కొత్తపల్లి అజయ్ కుమార్, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు రోలర్‌ను ఢీకొని..

శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన తొట్టంబేడు మండలం నెలబల్లి వద్ద శనివారం చోటు చేసుకుంది. తొట్టంబేడు పోలీసుల కథనం మేరకు.. బషీర్ (25) తిరుపతిలోని ఓటేరు గ్రామంలో నివసిస్తుంటాడు. శనివారం సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై తిరుపతి నుంచి నాయుడుపేటకు బయలుదేరాడు. నెలబల్లి వద్ద రోడ్ రోలర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తొట్టంబేడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.